



'ఎసెన్షియా' కంపెనీ వద్ద బుధవారం అర్ధరాత్రి అధికారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

విరుచుకుపడిన మృత్యువు



'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ వద్ద గుమిగూడిన జనం

'ఎసెన్షియా' ఫార్మాలో పేలుడు

18 మంది మృతి, 30 మందికి తీవ్ర గాయాలు

మృత్యువు కరాళ నృత్యం చేసింది. భారీ శబ్దంతో కార్మికులపై విరుచుకుపడింది. పనిగంటలు ముగిసి, ఇంటికి వెళ్లేందుకు సమాయత్తమవుతున్న తరుణంలో పేలిన రియాక్టర్ కొందరి శరీరాలను తునాతునకలు చేసింది. రసాయనాలతో కూడిన పొగ కమ్మేసి కొంతమంది ఊపిరి తీసేసింది. ఘటనలో మొత్తంగా 18 మందిని తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. మరెంతో మందిని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల హాహాకారాలు, ఆర్తనాదాలతో పరిశ్రమ ప్రాంగణం భీతావహ దృశ్యాన్ని తలపించింది.

- అనకాపల్లి, అచ్యుతాపురం ఆస్పత్రుల్లో క్షతగాత్రులు
- ఏ- షిఫ్ట్ ఉద్యోగులు విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఘటన
- భవన శిథిలాల కింద చిక్కుకున్న ఉద్యోగులు
- కర్మాగారంలో హాహాకారాలు

అచ్యుతాపురం, ఆగస్టు 21:
ఎప్పటిలాగే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో గల ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కార్మికులంతా బుధవారం ఉదయం విధులకు హాజరయ్యారు. సమయం సరిగ్గా మధ్యాహ్నం 1.50 గంటలు అయింది. ఏ- షిఫ్ట్ ముగిసింది. అప్పటికే బీ- షిఫ్ట్‌కి వాహనాల్లో ఉద్యోగులు వచ్చారు. వీరంతా వాహనాలు దిగి కర్మాగారంలోకి ప్రవేశిస్తున్నారు. ఈలోగా ఏ- షిఫ్ట్ ముగించుకొని కార్మికులు కార్మాగారం భవనం నుంచి బయటకు వస్తున్నారు. ఇంకో ఐదు నిమిషాల్లో వారు బయటకు వచ్చేస్తారు. బీ- షిఫ్ట్ ఉద్యోగులు వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి లోనికి ... మిగతా 8వ పేజీలో




విలపిస్తున్న మృతుడు వెంకటసాయి కుటుంబ సభ్యులు



అచ్యుతాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద క్షతగాత్రుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

నేడు సీఎం రాక



విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):
'ఎసెన్షియా' ఫార్మా కంపెనీని గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సందర్శించనున్నారు. ఆయన ఉదయం 10.30 గంటల తరువాత విజయవాడ నుంచి విమానంలో విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌కు వెళతారు. అనంతరం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రి, మరికొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శిస్తారు. అక్కడ నుంచి నగరానికి చేరుకుని కేజీహెచ్ చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించనున్నారు.



క్షతగాత్రుల వివరాలు

ఎ.పరమేష్ (ఎలమంచిలి), పంగా శ్రీనివాస్ (టెక్కలి), ఎం.లోవ శ్రీనివాస్ (విశాఖపట్నం), పి.దేముడు (బోయపాలెం), పి.జగదీశ్వరరావు (నక్కపల్లి), పొన్నాడ జగదీష్ (గాజువాక), పి.ధనుంజయ (ఒడిశా), తమరాన గంగాధర్ (తీడ), జీరెడ్డి కాశినాయుడు (నర్సీపట్నం), గెద్ద సంతోష్ (విజయనగరం), జి.సాయికుమార్ (బోనంగి), జాగారపు ప్రకాష్ (వేపాడ), ఎన్.అప్పారావు (రాంబిల్లి నేవీ కాలనీ), భూపతి శివవెంకటరత్నం (రాంబిల్లి), డి.అప్పారావు (ఎలమంచిలి), కె.నారాయణరావు (శ్రీకాకుళం), ప్రభాత్ యాదవ్ (వరంగల్), చందక బంగారు నాయుడు (విజయనగరం), కె.చంద్రశేఖర్ (బొబ్బిలి), జాగారపు వర్దన్ (జంగాలపాలెం), పి.జి.రాజా (రాంబిల్లి మండలం వెంకటాపురం), బి.సూరిబాబు (వై.లోవ), కె.రాంబాబు (రాంబిల్లి) ఎం.కిరణ్ సత్యనారాయణ (గాజువాక శ్రీనగర్) బి.రామునాయుడు, సీహెచ్ అప్పలరాజు, సత్యనారాయణ, నరేష్‌రెడ్డి, జీఎస్ వరప్రసాదరాజు, పి.అరుణకుమార్ (ఏ ప్రాంతానికి చెందినవారో తెలియాల్సి ఉంది). వీరంతా అచ్యుతాపురం, అనకాపల్లి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదరులకు రాఖీ కట్టేందుకు కాకినాడ వెళ్లిన చల్లపల్లి హారిక బుధవారం తెల్లవారుజామున అచ్యుతాపురం వచ్చింది. కుటుంబ సభ్యులు ఉండమని అడిగినా సెలవు అయిపోయిందని చెప్పి విధులకు హాజరై రియార్టర్ పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయింది.









క్షతగాత్రులు

అల్లూరి తొలి సాయుధ పోరుకు 102 ఏళ్లు

- 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై మెరుపు దాడి
- చెక్కు చెదరని నాటి ఆనవాళ్లు
- బ్రిటీష్ పోలీస్ స్టేషన్‌ను ఆధునికీకరిస్తామని రెండేళ్ల క్రితం కేంద్రం ప్రకటన
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం



అల్లూరి సీతారామరాజు దాడి చేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్(ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 21:
బ్రిటీష్ పాలకుల అకృత్యాల నుంచి ఆదివాసీలను విముక్తులను చేయడానికి విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడిపించిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంలో చరిత్ర సృష్టించింది. సాయుధ పోరాటానికి అవసరమైన ఆయుధాలను సమకూర్చుకోవడానికి తొలిసారి 1922 ఆగస్టు 22వ తేదీన చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై తన సైన్యంతో అల్లూరి దాడి చేశాడు. అల్లూరి జీవిత చరిత్రలో మరపురాని ఘట్టాల్లో ఒకటైన చింతపల్లి పోలీస్ స్టేషన్ ఘటనకు గురువారానికి 102 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని మోగల్లు గ్రామానికి చెందిన అల్లూరి వెంకట రామరాజు 15 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ పాలకుల తీరుపై ద్వేషంతో ఉండేవాడు. ఈ క్రమంలో లంబసింగి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి గిరిజనులను వినియోగించుకుంటూ వారిని ఇబ్బందులు పెడుతున్నట్టు తెలుసుకుని అప్పటి తహసీల్దార్ బాస్టియన్‌పై బ్రిటీష్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. కానీ బ్రిటీష్ అధికారులు తిరిగి అల్లూరిపై కేసు పెట్టారు. అల్లూరి మన్యంలో ఉంటే తిరుగుబాటు తెస్తాడని భావించిన బ్రిటీష్ పాలకులు నర్సీపట్నం తీసుకెళ్లి గృహ నిర్బంధం చేశారు. తరువాత అడ్డతీగల సమీపంలోని పైడిపుట్టిలో 50 ఎకరాల భూమి, కొన్ని పశువులను అల్లూరికి కేటాయించి తమ కనుసన్నల్లో ఉంచారు. 1922 జూన్‌లో పోలవరం డిప్యూటీ కలెక్టర్ ఫజులుల్లా ఖాన్ సహకారంతో అల్లూరి ప్రవాస శిక్షను తప్పించుకుని మన్యానికి వచ్చి సాయుధ పోరాటానికి సన్నద్ధమయ్యాడు. గాం గంటందొర, మల్లుదొర, కంకిపాటి ఎండుపడాల్, ఎర్రేసు, మరికొంత మంది గిరిజనులను సమీకరించి సాయుధ పోరాటంపై చైతన్యవంతులను చేశాడు. గెరిల్లా దాడులపై శిక్షణ ఇచ్చాడు. 1922 ఆగస్టు 19న సాయుధ పోరాటానికి అవసరమైన ఆయుధాలను సమకూర్చుకోవాలని చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడికి వ్యూహ రచన చేశాడు.

చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి

అల్లూరి సీతారామరాజు 1922 ఆగస్టు 22వ తేదీన గంటందొర, మల్లుదొర, ఎండుపడాల్, ఎర్రేస్‌తో పాటు 300 మంది గిరిజన విప్లవకారులతో కలిసి చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. పోలీసులను తాళ్లతో బంధించి 11 తుపాకులు, 1390 తుపాకీ గుళ్లు, 14 బాయ్‌నెట్లు, 5 కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను స్టేషన్ డైరీలో రాసి ఇంగ్లీష్‌లో సంతకం చేశారు. అనంతరం 23న కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. వరుసగా మూడు రోజుల పాటు మూడు స్టేషన్లపై అల్లూరి, అతని సేన దాడులు చేయడంతో బ్రిటీష్ అధికారుల్లో వణుకు పుట్టింది.

ఇప్పటికీ చింతపల్లిలో నాటి ఆనవాళ్లు

అల్లూరి సీతారామరాజు నాడు దాడి చేసిన పోలీస్ స్టేషన్ భవనం చింతపల్లిలో ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని ఒక ... మిగతా 8వ పేజీలో



ఆస్పత్రిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

అనధికార హాస్టళ్లలోని పిల్లలను అప్పగించండి

- కోలుకుంటున్న ఉమ్మడి విశాఖలోని ఆస్పత్రుల్లో గల విద్యార్థులు
- నేడు డిశ్చార్జి చేసే అవకాశం
- ఎప్పటికప్పుడు తాజా పరిస్థితులపై సీఎం ఆరా
- కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ వెల్లడి

పాడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో అనధికార హాస్టళ్లల్లో ఉన్న పిల్లలను తమకు అప్పగించాలని, వారిని ఆశ్రమ పాఠశాలల్లో చేర్పిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న గిరిజన బాలలను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనధికార హాస్టళ్లపై చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే చింతపల్లి, రంపచోడవరం ప్రాంతాల్లోని హాస్టళ్లను మూసివేయించామన్నారు. అనధికార హాస్టళ్లను గుర్తించేందుకు వివిధ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో వివిధ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులంతా కోలుకుంటున్నారన్నారు. ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న సీదరి సాయి, పాంగి కవిత, పాంగి జస్వంత్, పాంగి అభిషేక్, కొర్రా పవిత్ర, కిల్లో యశ్వంత్, కిల్లో సంజయ్‌తేజ, పాంగి వంశీ అనే మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు పూర్తిగా కోలుకున్నారని, వారిని గురువారం డిశ్చార్జి చేస్తారని కలెక్టర్ తెలిపారు. కైలాసపట్నం ఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటికి వరకు సీఎం చంద్రబాబునాయుడు తాజా పరిస్థితులపై ఆరా తీస్తూ తమను అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కృష్ణారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిండుకుండలా డొంకరాయి జలాశయం

ఎగువ ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడంతో పెరుగుతున్న ఇన్‌ఫ్లో

- 1,101 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల
- పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలో ఉండడంతో జెన్‌కో అధికారులు చర్యలు



డొంకరాయి జలాశయం నుంచి ఆరవ నంబర్ గేటు ద్వారా నీరు విడుదల చేస్తున్న దృశ్యం

సీలేరు, ఆగస్టు 21:
సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి బుధవారం ఉదయం నుంచి 1,101 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డొంకరాయి జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1,037 అడుగులు కాగా, బుధవారం ఉదయం నాటికి 1,036.50 అడుగులకు చేరింది. జలాశయం ఎగువ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది.

దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి జలాశయం పూర్తిస్థాయికి చేరుకుంటే గేట్లపై ఒత్తిడి పడే ప్రమాదం ఉందన్న నిపుణుల సూచనల మేరకు చర్యలు చేపడుతున్నారు. దీనిపై డొంకరాయి ఈఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5,048 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నదన్నారు. దీంతో జలాశయంలోని ఆరవ నంబర్ గేటు ఒక అడుగు పైకి ఎత్తి దిగువకు 1,101 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. మరో నాలుగు వేల క్యూసెక్కుల నీటిని కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇన్‌ఫ్లో తగ్గితే దిగువకు నీటి విడుదలను నిలిపివేస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతం జోలాపుట్‌లో 24.8372 టీఎంసీలు, బలిమెలలో 51.3750 టీఎంసీలు, గుంటవాడలో 0.9632 టీఎంసీలు, డొంకరాయిలో 13.1280 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 75.2122 టీఎంసీల నీటి నిల్వల్లో ఆంధ్రా వాటాగా 40.1828 టీఎంసీలు, డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో ఉన్న 14.0912 టీఎంసీలతో కలిపి మొత్తం సీలేరుకు 54.2738 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. పొల్లూరు, డొంకరాయి, సీలేరు మూడు జల విద్యుత్ కేంద్రాల్లో 6.0585 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్టు ఈఈ తెలిపారు.

ఆగస్టు 21 నాటికి జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..

జలాశయం పేరు	పూర్తిస్థాయి నీటి నిల్వ (అడుగుల్లో)	ప్రస్తుత నీటి నిల్వ (అడుగుల్లో)
జోలాపుట్	2,750	2,742.25
బలిమెల	1,516	1,490
గుంటవాడ	1,360	1,344.40
డొంకరాయి	1,037	1,036.50
ఫోర్‌బే	930	921.80

ఆస్పత్రుల్లో హాహాకారాలు

అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాల రోదనలు, క్షతగాత్రుల ఆక్రందనలతో పలు ఆస్పత్రుల వద్ద విషాద వాతావరణం నెలకొంది. మరోవైపు.. కార్మికులు, చనిపోయిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలంటూ కార్మిక సంఘాలు ఆగ్రహంతో ఆందోళనకు దిగాయి. అంబులెన్స్‌ల ఎదుట కార్మికులు నిరసనకు దిగారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు.. బాధితులను పరామర్శించారు. న్యాయం చేస్తామంటూ భరోసా ఇచ్చారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.


ఉషాప్రైమ్‌లో క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అంబులెన్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులు, కార్మిక సంఘాల నేతలు




పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించిన మృతదేహాలు


అంబులెన్స్‌కు అడ్డంగా కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికుడు


ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్న చైతన్య


గాయాలపాలైన సత్యనారాయణ, మోహనసతీష్


తీవ్ర గాయాలకు గురైన బాబా శ్రీనివాసవర్మ


ఎన్టీఆర్ వైద్యాలయంలో వైద్యులతో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవప్రసాద్


అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ బాలాజీ తదితరులు


తీవ్ర గాయాలకు గురైన ఓ కార్మికుడు


ఘటనా స్థలం వద్ద డీఐజీ గోపీనాథ్ జెట్టీ

క్రైం... crime news

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రాఘవరావు (ఫైల్)

సబ్బవరం, ఆగస్టు 21: వ్యక్తిగత సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలి. వంగలి గ్రామానికి చెందిన యర్రా రాఘవరావు (32)కు పదేళ్ల క్రితం అనకాపల్లి మండలం సింహాద్రిపురానికి చెందిన వసుధతో వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల జస్వంత్, మూడేళ్ల కౌశిక్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం వరకూ రాఘవరావు చేనులు అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు, అక్కడ మానేసి ప్రస్తుతం తాపీపని చేస్తున్నాడు. తాగుడుకు బానిసై దొరికినచోటల్లా అప్పులు చేశారు. చిన్నచిన్న చిల్లర దొంగతనాలు కూడా చేసేవాడు. వీటిని భరించలేని భార్య, ఇతడితో గొడవపడి రెండేళ్ల క్రితం పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాఘవరావు ఒంటరిగానే ఉంటున్నాడు. అప్పులు తీర్చలేక, భార్య తన వద్ద లేకపోవడంతో మానసిక వేదనకు గురయ్యేవాడు. చివరకు మనస్తాపం చెంది మంగళవారం రాత్రి పశువుల కల్లం వద్ద గల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై బుధవారం ఉదయం మృతుడి తండ్రి కొండబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

ఒడిశా పోలీసుల ఎదుట మావోయిస్టు లొంగుబాటు

సీలేరు, ఆగస్టు 21 : ఛత్తీస్‌గఢ్ క్యాడర్ మావోయిస్టు ముఖేష్ కొరస అలియాస్ సూర్య ఎదుట లొంగిపోయిన ట్టు మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీ ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోఅత్యంత కీలకమైన మావోయిస్టు నేత హెడ్మాకు ముఖేష్ కొరస ముఖ్య అనుచరుల్లో ఒకరని, అతను 2023లోమావోయిస్టు పార్టీలో దండకారణ్య ఎస్‌జెడ్‌సీగా కొనసాగారని చెప్పారు. అతనిపై ఒడిశాలో రూ.2 లక్షల రివార్డు ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాసం, ఉపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు.

కోల్‌కతాలో ఘటనపై న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థుల ఆందోళన


ర్యాలీ నిర్వహిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు, వైద్యులు, విద్యార్థులు

సబ్బవరం, ఆగస్టు 21: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం సాయంత్రం సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో విద్యార్థులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ కోల్‌కతాలో జరిగిన ఘటనతో దేశం యావత్తు దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాత (గైనకాలజిస్టు, స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆసుపత్రి), డాక్టర్ కె.సుధ, డాక్టర్ టి.వై.నిర్మల డాక్టర్ భాగ్యలక్ష్మితో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

20 మంది గిరిజన విద్యార్థుల డిశ్చార్జ్

- ఐటీడీఏ అంబులెన్స్‌లతో స్వగ్రామాలకు పంపిన అధికారులు
- మరో ఇద్దరు విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

నర్సీపట్నం/కొయ్యూరు, ఆగస్టు 21 : కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతతో ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది గిరిజన విద్యార్థులు కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జ్ చేసి వారి స్వగ్రామాలకు పంపించారు. కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పాసా అనాథ ఆశ్రమంలో శనివారం రాత్రి కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు చనిపోవడంతో పాటు పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. సోమవారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 60 మంది విద్యార్థులు చేరగా, మెరుగైన వైద్యం కోసం 39 మందిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. మిగిలిన 21 మంది విద్యార్థులు మంగళవారం ఏరియా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ విభాగంలో చికిత్స తీసుకున్నారు. అదే రోజు రాత్రి మరో గిరిజన విద్యార్థి అనారోగ్యంతో ఏరియా ఆస్పత్రిలో చేరింది. బుధవారం ఈ 22 మంది విద్యార్థుల్లో 20 మంది కోలుకోవడంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు డిశ్చార్జ్ చేశారు. పాంగి రాణి, పాంగి జ్యోతిల ఆరోగ్యం ఇంకా కుదుట పడకపోవడంతో ఆస్పత్రిలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.


గిరిజన విద్యార్థులను అంబులెన్స్‌లో స్వగ్రామాలకు పంపిస్తున్న అధికారులు

డిశ్చార్జ్ చేసిన వారిని స్వగ్రామాలకు పంపడానికి ఐటీడీఏకి సంబంధించి ఆరు అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. కోటవురట్ల తహసీల్దార్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. నర్సీపట్నం ఆర్డీవో జయరాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగశిరీష, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, ఏటీడబ్ల్యూవో పి.క్రాంతికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడేళ్ల బాలికపై వృద్ధుడి అఘాయిత్యం

- పోలీసుల అదుపులో నిందితుడు
- కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల డిమాండ్

కోటవురట్ల, ఆగస్టు 21 : ముక్కుపచ్చలారని మూడేళ్ల బాలికపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. సభ్య సమాజం నివ్వెరపోయేలా జరిగిన ఈ ఘటన అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల బాలికను సమీపంలో ఉంటున్న 65 ఏళ్ల వృద్ధుడు కోట పాములు చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి బుధవారం ఉదయం తన ఇంటికి తీసుకువెళ్లాడు.కుమార్తె కనిపించకపోవడంతో ఆమె తల్లి చుట్టుపక్కల వెతుకుతోంది. ఈలోగా పాములు ఇంట్లో నుంచి బయటకు వస్తూ బాలిక తల్లిని చూసి కంగారుపడ్డాడు. వెంటనే అతని ఇంట్లోకి వెళ్లిన ఆమె అక్కడ తన కుమార్తె ఉండడం చూసి నిర్ఘాంతపోయింది. బాలిక శరీరంపై స్వల్పగాయాలు ఉండడంతో పాములు ఘోరానికి ఒడిగట్టాడని గ్రహించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని, సదరు బాలికను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ఇదిలావుంటే, నిందితుడిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి.

వైజాగ్ ఫిల్మ్ క్లబ్ కోర్ కమిటీ రద్దు

- సర్వసభ్య సమావేశం తీర్మానం
- బైలా మార్చాలని నిర్ణయం
- వైసీపీ హయాంలో కోర్ కమిటీ పేరుతో ఆ పార్టీ నేతలతో శాశ్వత కమిటీ ఏర్పాటు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కోర్ కమిటీని రద్దు చేస్తూ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) తీర్మానం చేసింది. తిమ్మాపురంలోని క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కడా ఏ క్లబ్‌కు లేని విధంగా ఇక్కడ వైసీపీ పెద్దలు వారి హయాంలో కోర్ కమిటీ పేరుతో శాశ్వత కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వారి తదనంతరం ఆయా కుటుంబాల వారసులే అందులో ఉండేలా బైలా మార్చేశారు. ఈ విషయాలన్నీ గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జూన్ 22న క్లబ్‌కు వెళ్లి సభ్యులతో సమావేశం నిర్వహించారు. సినిమా పరిశ్రమకు సంబంధం లేని వారి చేతుల్లోకి సంస్థ వెళ్లిందని, అంతా నియమావళి ప్రకారం జరగాలని, ఏకపక్షంగా ఏర్పాటైన కమిటీ తప్పుకోవాలని సూచించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే మేనేజ్‌మెంట్ కమిటీ మొత్తం స్వచ్ఛందంగా రాజీనామా చేసింది. ఆ కమిటీ అధ్యక్షుడిగా వైసీపీ నాయకుడు కాయల వెంకటరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరాజు, కోశాధికారిగా ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఇప్పుడు వారంతా ఆయా బాధ్యతల నుంచి తప్పుకున్నారు. బుధవారం నిర్వహించిన ఏజీఎంలో కోర్ కమిటీని రద్దు చేశారు. ఏకపక్షంగా రూపొందించిన బైలాను సరిచేసి, అక్టోబరు నాటికి కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఏజీఎం నిర్ణయించింది. ఈ సందర్భంగా క్లబ్ పూర్వ అధ్యక్షుడు కేఎస్ రామారావు మాట్లాడుతూ, 1,400 మంది సభ్యుల విజ్ఞప్తి మేరకు తగిన చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో క్లబ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

- ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు



చోడవరం, ఆగస్టు 21: వచ్చే నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అధికారులు కృషి చేయాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మండల లీగల్‌సెల్ అధ్యక్షులు ఇ.రాజేంద్రబాబు కోరారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌ల ద్వారా కేసుల సత్వర పరిష్కారం లభిస్తుందని, రాజీకి అవకాశం ఉన్న కేసులు పరిష్కరించుకునేలా కక్షిదారులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీ వేసలపు వెంకటరావు, పోలీస్, ఎక్సైజ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ నాయకుడు మృతి


గోకాడ సన్యాసిదేముడు

చీడికాడ, ఆగస్టు 21: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన బైలపూడి గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు గోకాడ సన్యాసిదేముడు (40) చికిత్స పొం దుతూ మృతి చెందారు. ఈ నెల 11న సబ్బవరం నుంచి చోడ వరం వైపు బైక్‌పై వస్తుండగా అడ్డూరు- నర్సాపురం గ్రామాల మధ్యలోకి వచ్చేసరికి చోడవరం వైపు నుంచి వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో సన్యాసినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. విశాఖ డెయిరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి బుధవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు

▸▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం ఘటనలో బాధితులైన గిరిజన విద్యార్థులకు పాడేరు ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని తెలుగుదేశం పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చెప్పారు. స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ కైలాసపట్నం ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే అధికారులు అప్రమత్తమై బాధిత విద్యార్థులను వివిధ ఆస్పత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేశారన్నారు. అలాగే మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, అనధికార హాస్టళ్లపై ప్రభుత్వం తీసుకుంటున్నదని చెప్పారు. హాస్టళ్ల నిర్వాహకులు గిరిజన విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని ఆమె సూచించారు. ఆస్పత్రుల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై ఎప్పటికప్పుడు డీఎంహెచ్‌వో ద్వారా సమాచారం తెలుసుకుంటున్నామని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, టీడీపీ నేత డప్పోడి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీడీపీ నేతల పరామర్శ



విద్యార్థులతో మాట్లాడుతున్న పాండురంగస్వామి

పాడేరు ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న గిరిజన విద్యార్థులను తెలుగుదేశం పార్టీ డివిజన్ నేత, సర్పంచ్ పాంగి పాండురంగస్వామి బుధవారం పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎటువంటి అధైర్యం పడవద్దని, అందర్నీ ప్రభుత్వం ఆనుకుంటుందని చెప్పారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నేత జంపరంగి తిరుపతిరావు ఉన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు : గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, ఆగస్టు 21: కార్యకర్తలు అధైర్యపడొద్దని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సూచించారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 23వ తేదీ నుంచి ప్రభుత్వం నిర్వహించే గ్రామసభలకు కూటమి శ్రేణులు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. భేదాభిప్రాయాలు లేకుండా సమష్టిగా పనిచేద్దామని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.నాగబ్బాయి, జి.రెడ్డిబాబు, ఎల్.అప్పలరాజు, జి.కొండబాబు, కె.ఈశ్వరరావు, కొండలరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు కోనోవీడర్లు పంపిణీ



రైతులకు కోనోవీడర్లు పంపిణీ చేసిన శాస్త్రవేత్త అప్పలరాజు

చింతపల్లి, ఆగస్టు 21: కలుపు యాజమాన్యానికి ఉపయోగించే కోనోవీడర్లను రైతులకు ఉచితంగా అందజేసినట్టు టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు తెలిపారు. మండలంలోని పెదబరడ, వామగెడ్డ కొత్తూరు గ్రామాల్లో రైతులకు బుధవారం కోనోవీడర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వరుసల పద్ధతిలో వరి నాట్లు వేసుకుని, కలుపు నివారణ యాజమాన్య పద్ధతులను ఆదివాసీ రైతులకు నేర్పించామన్నారు. ఈ ఏడాది రైతులే స్వయంగా వరుసల పద్ధతిలో నాట్లు వేసుకున్నారన్నారు. దీంతో కలుపు యాజమాన్యానికి అవసరమైన కోనోవీడర్లను అంజేశామని చెప్పారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



ఆవుకు తనిఖీలు చేస్తున్న పశు వైద్య సిబ్బంది

అనంతగిరి, ఆగస్టు 21: మండలంలోని మారుమూల జీనబాడు పంచాయతీ కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కాశీపట్నం పశు వైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు 64 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. వర్షాకాలం కావడంతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు సంభవిస్తే పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ప్రతి ఏటా రెండుసార్లు పశువులకు గాలికుంటు టీకాలను వేస్తున్నామన్నారు. కార్యక్రమంలోని పినకోట జూనియర్ పశు వైద్యాధికారి సుధావాణి, సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి, సొవ్వ పంచాయతీల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశు వైద్యాధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో పశువులకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసుకోవడం వల్ల పాల దిగుబడి తగ్గు తుందనేది అపోహ మాత్రమేనని స్పష్టం చేశారు. దీనిపై గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సుబ్బారావు, త్రినాథరావు, సంజీవరావు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

హుకుంపేట: పాడి పశువులకు వ్యాధులు రాకముందే టీకాలు వేయించుకోవాలని పశు వైద్యాధికారి చరణ్ తెలిపారు. మండలంలోని సంతారి సచివాలయం పరిధిలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై డాక్టర్ చరణ్ రైతులకు అవగాహన కల్పించారు. టీకాల కార్యక్రమాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అల్లూరి తొలి సాయుధ పోరుకు 102 ఏళ్లు

... 5వ పేజీ తరువాయి

భాగాన్ని పోలీసులు ఉపయోగించుకుంటున్నారు. మరో భాగాన్ని ఉప ఖజానా కార్యాలయంగా వినియోగిస్తున్నారు. ఉప ఖజానా కార్యాలయంలో బ్రిటీష్ అధికారులు ఉపయోగించిన ఇనుప ఖజానా పెట్టె, ఫ్యాన్ తిప్పేందుకు ఉపయోగించిన రోప్ పదిలంగా ఉన్నాయి.

అటకెక్కిన పోలీస్ స్టేషన్ ఆధునికీకరణ

అల్లూరి సీతారామరాజు దాడి చేసిన చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆధునీకరిస్తామని 2022లో చింతపల్లి సందర్శించిన నాటి కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. అలాగే భీమవరంలో అల్లూరి సీతారామరాజు 125 ఏళ్ల జయంతి ఉత్సవానికి హాజరైన ప్రధాన మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ చింతపల్లి పోలీస్ స్టేషన్ ను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. ఆధునికీకరణ కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తున్నట్టు చెప్పారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శనీయ ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అయితే ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.

క్యాన్సర్ నియంత్రణకు సేవలందించండి

▸▸ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో క్యాన్సర్‌ను నియంత్రించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు మరిన్ని సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం క్యాన్సర్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన పెద్దగా ఉండదని, ఈ క్రమంలో లక్షణాలను గుర్తించి వారికి నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో జిల్లా యంత్రాంగం, వైఎస్.జయమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఏడాది మే 27 నుంచి ఏజెన్సీలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేపడుతున్నారన్నారు. ఇప్పటివరకు 61 ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుచేసి 5,274 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారన్నారు. ఇందులో క్యాన్సర్ ఉన్నట్టు తేలితే విశాఖపట్నంలోని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో అవసరమైన చికిత్సలు అందిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని భావించే ప్రజలు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం వల్ల శతశాతం నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల అనుమానితులు నిర్ధారణ పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలని సూచించారు. అలాగే ఈ నెల 22న చింతపల్లి మండలం కోరుకొండ పీహెచ్‌సీలో, 23న చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీవో కోరారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలపై చేపడుతున్న చర్యలను వైఎస్.జయమ్మ ట్రస్ట్ ప్రతినిధి వైఎస్.రవీంద్రనాథరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కృష్ణారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ బంద్‌తో అరకులో దుకాణాల మూత



అరకులో నినాదాలు చేస్తున్న మాలమహానాడు నాయకులు... (ఇన్‌సెట్‌లో) మూతబడ్డ దుకాణాలు

అరకులోయ, ఆగస్టు 22: అరకులోయలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. మాలమహానాడు కమిటీ ప్రతినిధులు రత్నరాజు, భూపతిలెనిన్‌రాజు, పైడిరాజు ఆధ్వర్యంలో మాలలంతా పెద్ద ఎత్తున పాల్గొని ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం నుంచే బంద్ జరగడంతో దాదాపు అన్ని దుకాణాలు మూసివేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపు వాహనాలు నిలిపి వేయడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయింది. దీంతో పోలీసులు నిరసనకారులతో మాట్లాడి వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వరకు బంద్ కొనసాగింది. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించవద్దని, వర్గీకరణను రద్దు చేయాలని కమిటి ప్రతినిధులు నినాదాలు చేశారు. అరకులోయ నాలుగురోడ్ల జంక్షన్ వద్ద రహదారికి అడ్డంగా బానర్‌లతో నిరసనలు తెలిపారు. బంద్ సందర్భంగా ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. బంద్‌లో మాలమహానాడు ప్రతినిధులు మంద చంద్రశేకర్‌ప్రసాద్, తిరుగుళ్ల చందర్‌రావు, ఎం.కిరణ్ కుమార్, కె.రవికుమార్, ఎలూరి నవీన్‌కిరణ్, టి.సతీష్‌కుమార్, దాసరి లక్ష్మణ్, చెరుకూరి మోజెస్, మంద శ్రీను, మత్తి కిరణ్‌కుమార్, బాబీ పాల్గొన్నారు.

కో-ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో రెండో విడత ప్రవేశాలు ప్రారంభం

అరకులోయ, ఆగస్టు 21: అరకులోయ ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు గురువారం నుంచి రెండో విడత ప్రక్రియ ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ఈ నెల 24తో ముగుస్తుందన్నారు. 23వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన

ముంచంగిపుట్టు, ఆగస్టు 21: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నూతన మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదన్నారు. గత కొన్నేళ్లుగా వివిధ కేటగిరిల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నామని, తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచన చేసి తమకు ప్రత్యామ్నాయ మార్గంలో ఉపాధి కల్పించేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మద్యం దుకాణం సూపర్‌వైజర్ సంఘం ప్రతినిధి ఆర్.రాంబాబు, సేల్స్‌మెన్ జి.దనర్జన్, కె.మల్లేష్, వాచ్‌మెన్ ఆర్.చంద్రశేఖర్, ఎస్.కృష్ణ, చైతన్యదొర పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కొయ్యూరు, ఆగస్టు 21: మండలంలోని రేవళ్లు కూడలిలో బుధవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించే వాహన చోదకులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా మంప ఎస్ఐ లోకేష్‌కుమార్ హెచ్చరించారు. అలాగే వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, అన్ని పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రమాదాల నుంచి రక్షణకు వీలుగా సీట్‌బెల్ట్ ఉపయోగించడం, హెల్మెట్ ధరించడం మంచిదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు.


రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

చింతపల్లి, ఆగస్టు 21: గూడెంకొత్తవీధి-చింతపల్లి ప్రధాన రహదారిలో రింతాడ మలుపు వద్ద ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గిరిజనులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన కిల్లో సాయి, కొర్ర సూరిబాబు ద్విచక్ర వాహనంపై గూడెంకొత్తవీధి వెళ్తున్నారు. జీకే వీధికి చెందిన వీరబాబు మరో ద్విచక్ర వాహనంపై చింతపల్లి వస్తున్నాడు. రెండు వాహనాలు రింతాడ మలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో గాయపడిన క్షతగాత్రులను స్థానికులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రథమ చికిత్స చేసి నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

ముంచంగిపుట్టులో బైక్ చోరీ

ముంచంగిపుట్టు, ఆగస్టు 21: మండల కేంద్రంలోని ఇందిరా కాలనీలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. కాలనీలో ఉంటున్న బాకూరు యుగంధర్ ఎప్పటిలాగే రాత్రి ఇంటి ముందు వాహనం పార్కు చేశారు. ఉదయం చూసేసరికి వాహనం అక్కడ లేదు. ఇంటికి ఇరువైపులా, వీధిలో వెతకగా వాహనం ఆచూకీ తెలియరాలేదు. దీంతో యుగంధర్‌రాజు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు. గతంలో సుమారు 12 ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. అప్పట్లో పోలీసులు చాకచక్యంగా ద్విచక్ర వాహన దొంగలను పట్టుకొని, వాహనాలను రికవరీ చేశారు. ప్రస్తుతం వాహనాలు చోరీకి గురవుతుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దొంగతనాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

రాజ్‌మా విత్తనాలు వినియోగించుకోండి



గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

హుకుంపేట, ఆగస్టు 21: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచించారు. మండలంలోని రంగశీల సచివాలయ పరిధిలో బుధవారం రాజ్‌మా విత్తనాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 90 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తుందన్నారు. ఈ విత్తనాలను మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విత్తనాలతో పంటలు సాగుచేసుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రంగశీల గ్రామ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ నాయకులు, రైతులు ఉన్నారు

లోకుల గాంధీ సేవా భూషణ్ అవార్డుల ప్రదానం

కొయ్యూరు, ఆగస్టు 21: లోకుల గాంధీ సేవా భూషణ్ అవార్డులను మండలానికి చెందిన ఆర్ఐ దుమంతి సత్యనారాయణ, టి.మల్లేష్‌కు అందించారు. మండలంలోని శరభన్నపాలెం గ్రామంలో లోకుల గాంధీ వర్ధంతిని ట్రస్టు ప్రతినిధులు, కుటుంబీకులు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, జడ్పీటీసీ వారా నూకరాజు, జీసీసీ మాజీ చైర్‌పర్సన్ ఎంవీవీ సత్యనారాయణ, ట్రస్టు ప్రతినిధులు లోకుల కిరణ్, ఈశ్వరరావు, రమేష్, ఎం.మురళీకృష్ణ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు లేని వసతిగృహాలు మూసివేత



శాంతి సాధన పాఠశాలను పరిశీలిస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 21: అనుమతులు లేని వసతి గృహాలను మూసివేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల ప్రత్యేక కమిటీ సభ్యులు ఎంపీడీవో, ఏటీడబ్ల్యూవో జయనాగ లక్ష్మి, రెవెన్యూ, పోలీసు అధికారులు ప్రైవేటు వసతి గృహాలను తనిఖీ చేశారు. జీకే వీధిలో నెతన్య కృపా గిరిజన సంక్షేమశాఖ వసతి గృహానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన డాక్యుమెంట్లు రెండు రోజుల్లో సమర్పిస్తామని నిర్వాహకులు తెలపడంతో సమయం ఇచ్చామన్నారు. రెండు రోజుల్లో డాక్యుమెంట్లు చూపించకపోతే వసతి గృహాన్ని సీజ్ చేస్తామన్నారు. ఈ వసతి గృహంలో ఉన్న 35 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నారాయణరావు, ఈవోఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

విరుచుకుపడిన మృత్యువు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్నారు. ఈలోగా భారీ శబ్దం వినిపించింది. దీంతో బీ-షిఫ్ట్ కార్మికులు ఉలిక్కి పడి వెనక్కి పరుగులు తీశారు. అప్పటికి ఏ-షిఫ్ట్ ఉద్యోగులు కొందరు పరుగులు తీసి బయటకు వచ్చారు. ఒక షిఫ్ట్‌కి ఇక్కడ 80 మంది పనిచేస్తారు. కర్మాగారంలో సుమారు 40 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఏం జరిగిందో తెలియదు, దట్టమైన పొగలు వ్యాపించాయి. భారీ పేలుడు సంభవించడంతో రియాక్టర్ పేలిందని కార్మికులు తెలుసుకున్నారు. లోనికి వెళ్లడానికి ఎవరూ సాహసించలేకపోయారు. అయినా ధైర్యం చేసి తోటి కార్మికులు కర్మాగారంలోకి ప్రవేశించారు. కర్మాగారంలో చెల్లాచెదురుగా కార్మికులు పడిపోయి ఉన్నారు. ఒంటి నిండా తీవ్ర గాయాలు, కొందరు స్పృహ కోల్పోయారు. దీంతో కర్మాగారంలో హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురం ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది బయటకు వచ్చారో?, ఎంతమంది కర్మాగారం లోపల ఉన్నారో తెలియని పరిస్థితి. కెమికల్‌తో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. హైడ్రోజన్ గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ప్రమాద ఉధృతి పెరిగిందని అంటున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ దళాలు వచ్చిన తరువాత సహాయక చర్యలు చురుకుగా సాగాయి. భవన శిథిలాల కింద చిక్కుకుపోయి ఛిద్రమైన మృతదేహాలను వెలికి తీశారు.

అనకాపల్లి ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

అనకాపల్లి టౌన్/తుమ్మపాల, ఆగస్టు 21 : అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' అడ్వాన్స్‌డ్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బుధవారం జరిగిన పెను ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులకు ఎన్టీఆర్ వైద్యాలయం, పట్టణంలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ఎస్ఈజెడ్ కాలనీ మోటూరుపాలెం గ్రామానికి చెందిన పూడి మోహనదుర్గాప్రసాద్(20), కాకినాడకు చెందిన సీహెచ్ హారిక (22)లు ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చేసరికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో విజయనగరం జిల్లాకు చెందిన పి.రాజశేఖర్ (23) కూడా మృతి చెందాడు. అచ్యుతాపురానికి చెందిన వై.చిన్నారావు(32) మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని కూడా ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారని సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సంఘటనలో తీవ్ర గాయాలకు గురై ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చిన వారిలో తణుకు సమీపాన దువ్వ గ్రామానికి చెందిన బాబా శ్రీనివాసవర్మ, విజయనగరానికి చెందిన జి.చైతన్య, ఏలూరుకు చెందిన కె.సత్యనారాయణ, పి.మోహనసతీశ్‌లు వైద్య సేవలు పొందారు. వీరిలో బాబా శ్రీనివాసవర్మకు బలమైన గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించామని, మిగిలిన ముగ్గురికి ఎటువంటి ప్రాణహాని లేదని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చి సంఘటనలో మృతి చెందిన, క్షతగాత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తీవ్రంగా గాయపడి ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 14 మందిలో విజయనగరానికి చెందిన పి. రాజశేఖర్ (23) మృతి చెందగా, కె.చంద్రశేఖర్, జె.వరహాలరావు, జి.రాజా, బి.సూరిబాబు, కె. రాంబాబు, ఎం.కిరణ్ సత్యనారాయణ, బి.శివ వెంకటరత్నం, డి.అప్పారావు, ఆర్.వరలక్ష్మి, ఎస్. యామిని, కె.నారాయణరావు, ప్రభాత్‌యాదవ్, బంగారు చందకనాయుడు చికిత్స పొందుతున్నారు. వీరిలో రాంబిల్లికి చెందిన కె. రాంబాబు పరిస్థితి విషమయంగా ఉందని వైద్యులు తెలిపారు. అచ్యుతాపురం పవన్‌సాయి ఆస్పత్రిలో 13 మంది చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారిలో ఎ.పరమేశ్, టి.శ్రీనివాస్, ఎం.లోవ శ్రీనివాస్, పి.దేముడు, పి.జగదీశ్వరరావు, పి.జగదీశ్, టి.ధనుంజయ్, టి.గంగాధర్, కె.కాశీరామ్, జి.సంతోశ్, జి.సాయికుమార్, జె.ప్రకాశ్, ఎస్.అప్పారావులు ఉన్నారు.

బాధితుల కన్నీరుమున్నీరు

ఈ ప్రమాదంలో పూడి మోహనదుర్గాప్రసాద్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో కన్నీరుమున్నీరుగా విలపించారు. తాను ఉదయం డ్యూటీకి వెళ్లి వచ్చేశానని, తన తమ్ముడు మోహనదుర్గాప్రసాద్ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లి మృతి చెందాడని అతని అన్న నానిబాబు విలపించాడు. ఇంటర్ చదివిన తన తమ్ముడు ఖాళీగా ఉండడం ఇష్టం లేక కేవలం నెలకు రూ.12 వేలు జీతానికి ఏడాది క్రితం విధుల్లో చేరాడని తెలిపారు.

☛ సంక్షిప్తంగా..

నలుగురు ఎస్ఐలకు శ్రీకాకుళం జిల్లా బదిలీ

పాడేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు పోలీస్ డివిజన్ పరిధిలోని నలుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్‌జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు ఎస్ఐ జి.లక్ష్మణరావును శ్రీకాకుళం జిల్లా లావేరు, అరకులోయ ఎస్ఐ ఆర్.సంతోశ్‌ను శ్రీకాకుళం రెండో టౌన్‌కు, జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న సిహెచ్.దుర్గాప్రసాద్‌ను శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేట, వీఆర్‌లో ఉన్న రంజిత్‌ను శ్రీకాకుళం జిల్లా పోలాకి స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరి స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు.

సీఐగా హిమగిరి బాధ్యతలు



అరకులోయ, ఆగస్టు 21: అరకులోయ సీఐగా ఎల్.హిమగిరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. అతను గతంలో డుంబ్రిగుడ ఎస్ఐగా పనిచేశారు. ఇక్కడ సీఐగా పనిచేసిన రుద్రశేఖర్ విశాఖపట్నం బదిలీపై వెళ్లారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

పాడేరు రూరల్, ఆగస్టు 21: ముంచంగిపుట్టు, చింతపల్లి ప్రాంతాల్లోని సబ్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 23న విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ ఏవీఎస్ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో లైన్ల మరమ్మతులు, ఇతర పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

చింతపల్లి ఎంపీడీవోగా ఆశాజ్యోతి

చింతపల్లి, ఆగస్టు 21: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.ఆశాజ్యోతి బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడికి కాకినాడ జిల్లా పెదపూడికి బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోలను ప్రభుత్వం పూర్వ స్థానాలకు బదిలీ చేయడంతో విధుల్లో చేరారు. ఇక్కడ నాలుగు నెలలు పనిచేసిన వీరసాయిబాబు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంకు బదిలీ అయ్యారు.

వీరసాయిబాబుకు సన్మానం

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో వీర సాయిబాబును బుధవారం ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏవో రవీంద్ర మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేశారని కొనియాడారు. చింతపల్లిలో పని చేసిన కాలం ఎన్నడూ మర్చిపోలేనని సన్మాన గ్రహీత వీరసాయిబాబు పేర్కొన్నారు. ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ జాన్ దయానంద్ పాల్గొన్నారు.

కొయ్యూరు ఎంపీడీవోగా మేరీరోస్ బాధ్యతల స్వీకారం

కొయ్యూరు, ఆగస్టు 21: కొయ్యూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా మేరీరోస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిప్యుటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్న లాలం సీతయ్య తిరిగి అనంతగిరి వెళ్లారు. ఎన్నికల అనంతరం జరిగిన బదిలీలలో తిరిగి మేరీరోస్‌కు ఇక్కడ ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బాధిత కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి

పాడేరు రూరల్, ఆగస్టు 21: కైలాసపట్నం ఘటనలో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కొర్రా రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న గిరిజన విద్యార్థులను బుధవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. బాధిత విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం సంపూర్ణంగా ఆదుకోవాలని, అనధికార హాస్టళ్లను మూసివేయించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు వి.కృష్ణారావు, పి.చినబాబు, రాజు, డానియేలు, చందు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

జి.మాడుగుల, ఆగస్టు 21: ప్రకృతి వ్యవసాయంపై ఏపీసీఎన్ఎఫ్ బృందం గిరిజనులకు అవగాహన కల్పించారు. మారుమూల కిల్లంకోట గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. జీవమృతాలు తయారీ విధానం, వాటి ఫలితాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు గణపతి, సత్యవతి, రామలింగం, సింహాచలం, రాజుపడాల్, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీలేరు, ఆగస్టు 21: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.విష్ణుకుమార్‌రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 5న సీఎండీ కార్యాలయాలు, జెన్‌కో కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నందున సీఐటీయూసీ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పీఆర్‌సీ వేతన బకాయిలు చెల్లించాలని తదితర 12 డిమాండ్లతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఏకలవ్య భవనాలు వేగవంతం చేయండి

అనంతగిరి, ఆగస్టు 21: పాతకోట సమీపంలోని రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనాలను వేగవంతం చేయాలని జడ్పీటీసీ సభ్యులు గంగరాజు సూచించారు. బుధవారం ఈ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నాలుగేళ్లుగా అరకులోయ వైటీసీలో పాఠశాలను నిర్వహిస్తున్నారని, అక్కడ తగిన సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ భవనాలను త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే కైలాసపట్నంలోని ఆశ్రమంలో జరిగిన ఘటనతో గిరిజన చిన్నారుల మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట నాయకులు కిల్లో మోస్య, సోమేల నాగులు, అర్జున్ ఉన్నారు.